సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



'గృహలక్ష్మి' గిరిజనులకేనా?

గృహలక్ష్మి పథకంలో అర్హులుగా గిరిజనులనే గుర్తించడంతో గిరిజనేతర దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. 8లో



కొరవడిన సమయపాలన

కేటీపీఎస్ ప్రధాన కార్యాలయంలో కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 24°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈపీఎఫ్‌పై అవగాహన అవసరం

ఢిల్లీ రీజినల్ కమిషనర్ సనత్‌కుమార్



మాట్లాడుతున్న సనత్‌కుమార్

ఇల్లెందు: మున్సిపాల్టీలో పని చేస్తున్న కార్మికులకు ఈపీఎఫ్‌పై అవగాహన అవసరమని ఈపీఎఫ్ ఢిల్లీ రీజినల్ కమిషనర్ సనత్ కుమార్ అన్నారు. సోమవారం ఇల్లెందు సమావేశం మందిరంలో కార్మికులకు ఈపీఎఫ్‌పై అవగాహన కల్పించారు. పదేళ్ల ఈపీఎఫ్ ఉంటే పెన్షన్‌కు అర్హత పొందుతారని తెలిపారు. పీఎఫ్ సదుపాయం ఉండి నెల రోజుల తర్వాత మృతి చెందితే వారి పిల్లలకు బీమా పెన్షన్ వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వరంగల్ రీజినల్ కమిషనర్ ప్రణత్ జోషి, కమిషనర్ కుమారస్వామి, మేనేజర్ అంకుషావలి, ఇఫ్టూ కార్యదర్శి యాకుబ్‌షావలి, సునిల్‌కుమార్, రమేష్, ఉమ, భూలక్ష్మి, రాజు, వెంకటేశ్వర్లు, కృష్ణ, భారతి, వీరన్న పాల్గొన్నారు.

అకౌంటెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని కరకగూడెం కేజీబీవీ, కొత్తగూడెం యూఆర్ఎస్(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్)లో అకౌంటెంట్ పోస్టులకు అర్హత కలిగిన, జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

టీ-9 టికెట్లకు తాత్కాలిక బ్రేక్

భద్రాచలంటౌన్: పల్లె వెలుగు ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన టీ-9 టికెట్ల జారీని తాత్కాలికంగా నిలిపేసినట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ వచ్చేనెల 2వ తేదీ నుంచి యథావిధిగా ఈ టికెట్లు ఇస్తామని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

జాతీయ స్థాయిలో గురుకులం విద్యార్థిని సత్తా



బహుమతి అందుకుంటున్న ధనుశ్రీ

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల విద్యార్థిని బానోత్ ధనుశ్రీ జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటింది. హైదరాబాద్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన స్లాన్ ఫస్ట్ ఇంటర్నేషనల్ బీలో 1600 ఫైడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్–2023ను నిర్వహించారు. ఈ టోర్నీలో భద్రాచలం గిరిజన గురుకుల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చదువుతున్న ధనుశ్రీ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు అభినందించారు.

రామా.. కనుమా!



భద్రాచలం పట్టణం వ్యూ

ప్రకటనలకే పరిమితమైన భద్రాచలం అభివృద్ధి

- ఎన్నికల వేళ తెరపైకి మళ్లీ అదే జపం
- హామీల అమలును పట్టించుకోని పాలకులు
- గిరిజన యూనివర్సిటీ, అంతర్రాష్ట్ర డిపో కాగితాలకే పరిమితం

భద్రాచలం: 'భద్రగిరి అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తాం.. ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం' ఇది సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే ఇచ్చిన హామీ. భద్రాచలంలో గోదావరి ముంపు బాధితులకు రూ.1000 కోట్లతో ఎత్తైన ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని గతేడాది జూలైలో గోదావరి వరదల సందర్భంగా చేసిన ప్రకటన. కానీ ఇవేమీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ భద్రాద్రి అభివృద్ధి మంత్రం తెరమీదకు వచ్చింది. అన్ని పార్టీలూ ఇప్పుడు భద్రాచలంపై దృష్టి సారించాయి. నియోజకవర్గ పరిధిలో ఎక్కువ జనాభా భద్రాచలంలోనే ఉండటం, గిరిజన, గిరిజనేతర ప్రజలతో మిశ్రమంగా కలిసి ఉండటంతో పాటు ప్రధానంగా దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి గాంచడంతో ఇప్పుడు అన్ని పార్టీలకూ భద్రాచలం అభివృద్ధే ప్రధాన అజెండాగా మారింది.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు కూడలిగా..

పూర్తి ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న భద్రాచలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు కూడలిగా ఉంది. ఆయా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల వారికి విద్య, వైద్య, వ్యాపార కేంద్రాలకు పెద్ద దిక్కుగా ఉంది. ప్రధానంగా ఈ నాలుగు రాష్ట్రాల గిరిజనులు ఏ అవసరానికైనా భద్రాచలమే వస్తుంటారు. అయితే పట్టణంలో అందుకు తగ్గట్టుగా అభివృద్ధి మాత్రం జరగడం లేదు. ఆయా జనాభాకు సరిపడా వ్యాపార సముదాయాలు, అంతర్రాష్ట్ర బస్ డిపోగా విస్తరణ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయి. విద్య, వైద్య సదుపాయాలు సైతం అంతంతగానే అందుతున్నాయి. ఈ నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్న పాలకుల మాట కలగానే నిలిచిపోయింది. సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తే ఎంతో మంది గిరిజన విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. కానీ ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదని గిరిజన సంఘాలు అంటున్నాయి. ఇక్కడి ఆర్టీసీ డిపోను అంతర్రాష్ట్ర డిపోగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నడుమ బస్సులు నడుస్తున్నప్పటికీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు మాత్రం ఇక్కడి నుంచి ప్రభుత్వ రవాణా సౌకర్యం లేదు. ఆయా రాష్ట్రాలకు చెందిన గిరిజనుల వ్యాపార కేంద్రంగా భద్రాచలమే ఉన్నప్పటికీ.. వారి అవసరాలకు తగ్గట్టుగా మార్కెట్ సదుపాయం కల్పించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర విభజన నుంచీ అదే చిన్నచూపు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజనలో భాగంగా భద్రాచలానికి తీవ్ర నష్టం జరిగింది. పోలవరం ముంపు పేరుతో ఈ డివిజన్‌లో ఉన్న కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాలను పూర్తిగా, భద్రాచలం పట్టణం మినహా ఇతర గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. అలాగే భద్రాచలంలో ఉన్న ఐదు గ్రామపంచాయతీలను సైతం ఏపీలో కలిపి పట్టణాన్ని చిన్న ముక్కగా చేశారు. ఇక జిల్లాల పునర్విభజనలో వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపి ఈ జిల్లాను మరింత 'చిన్నబుచ్చారు'. ఈ లోటును భర్తీ చేసేందుకు భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు, రూ.1000 కోట్లు ఇస్తామంటూ చేసిన హామీలు కార్యరూపం దాల్చలేదు. దీనిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు, వాదోపవాదాలతోనే కాలం గడిచిపోతోంది తప్ప భద్రాచలం అభివృద్ధి మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. హడావిడి మళ్లీ మొదలైంది. ఎన్నికలు ముగిసే దాకా ఈ ఆర్భాటాలకు ఏ లోటూ ఉండదని, ఎన్నికలు ముగిస్తే మళ్లీ యథాప్రకారమేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు



మళ్లీ అధికారం మాదే..

- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ నిలుస్తారు
- అమిత్‌షాకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఇల్లెందులో బస్ డిపో, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



బస్ డిపోను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ కవిత, హరిప్రియ

ఇల్లెందు: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారమని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ నిలుస్తారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఇల్లెందులో శాటిలైట్ బస్‌డిపోను ఆయన ప్రారంభించారు. అంతకుముందు కరెంటాఫీస్ వద్ద రూ.10 కోట్లతో రహదారి విస్తరణ, అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనులకు, జేకే కాలనీలో రూ.కోటితో నిర్మిస్తున్న డిజిటల్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేశారు. జగదాంబా సెంటర్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన రోడ్ విస్తరణ, రూ.1.50 కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సు ప్రారంభించారు. రూ.3.75 కోట్లతో నిర్మించిన టీఎస్ఆర్టీసీ బస్ డిపోను ప్రారంభించి, బస్టాండ్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించనున్న సీసీ ప్లాట్‌ఫాం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇక్కడి ప్రజలు బస్‌డిపో, ఆంబజార్ విస్తరణ చేయాలని అడిగారని, నాటి హామీని నేడు నెరవేర్చానని చెప్పారు. డిపోలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 లక్షలు కేటాయించగా, మరో రూ. 25 లక్షలు కావాలన్న ఎమ్మెల్యే హరిప్రియ కోరిక మేరకు ఆ నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలో జరిగిన అమిత్‌షా సభ జనం లేక వెలవెలబోయిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బీ టీం అని, బీఆర్ఎస్ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని అమిత్‌షా అన్నారని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేవెళ్లలో మాట్లాడుతూ బీఆర్ఎస్ బీజేపీకి బీ టీం అన్నారని, తాము ఆ రెండు పార్టీలకూ సమదూరంలో ఉంటామని, ప్రజలకు మాత్రమే బీ టీం అని తెలిపారు. రైతుల గురించి మాట్లాడే అర్హత అమిత్‌షాకు లేదని, మొదలు ఆయన ఢిల్లీ ఆందోళనలో మృతి చెందిన రైతుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని హితవు పలికారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలతో బీజేపీ పీఠాలు కదిలిపోతున్నాయని విమర్శించారు. ఏనాడూ బ్యాట్ పట్టని అమిత్‌షా కుమారుడికి బీసీసీఐ చైర్మన్ పదవి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పెద్దలు కుటుంబ వారసత్వంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ పార్టీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో 10కి పది స్థానాలు గెలుస్తామన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో 43 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని తెలిపారు. ఈ ఫైల్ గవర్నర్ నుంచి రాగానే సర్కారు ఉద్యోగుల తరహాలో జీతాలు, పీఆర్సీ చెల్లిస్తామన్నారు. ఎంపీ కవిత మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. రవాణా శాఖ మంత్రిగా పువ్వాడ అజయ్‌కుమార్ ఉండడం వల్లే బస్ డిపో సాధ్యమైందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, అజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్ వెంకన్న, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శిరీష, మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, తహసీల్దార్ కె.రవికుమార్, డీఎం బి. వెంకటేశ్వరరావు, బస్ స్టేషన్ ఇంచార్జ్ వేముల నాగరాజు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: ఇల్లెందు ముఖద్వారం ఇక మీదట అద్భుతంగా ఉండబోతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లెందు పట్టణానికి ముఖద్వారంగా ఉన్న సుభాష్‌నగర్ ప్రధాన రహదారి వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులతో పాటు ప్రధాన కూడలి ఆధునికీకరణ పనులతో ఈ ప్రాంతం పట్టణాలను మరిపించేలా దర్శనమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శీలం ఉమ, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి, కొల్లిపాక శ్రీనివాస్, ఆళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రారోపణం



గోదావరికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

- రామయ్యకు స్నపన తిరుమంజనం
- గోదావరిలో రామకోటి నిమజ్జనం



స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సోమవారం 'పవిత్రారోపణం' కార్యక్రమాన్ని నేత్రపర్వంగా జరిపించారు. తొలుత స్వామివారికి వేద విన్నపాలు చేసి, బేడా మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర ధారతో ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. పవిత్రలను ప్రధాన ఆలయం నుంచి తీసుకొచ్చి పూజల అనంతరం మూలమూర్తులకు ధరింప చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారికి, ఆంజనేయ స్వామి వారికి, భక్తరామదాసు, గోదాదేవి విగ్రహాలకు పవిత్రలు వేశారు. అనంతరం ఆలయానికి, ధ్వజ స్తంభం, బలిపీఠం, సుదర్శన చక్రానికి ధరింపజేసి, అర్చకులు సైతం ధరించారు. గతేడాది కాలంలో రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో జరిగిన దోష నివారణకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రామకోటి నిమజ్జనం


భక్తులు ఆలయంలో సమర్పించిన రామకోటి పుస్తకాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. రామకోటి పుస్తకాలను ఊరేగింపుగా గోదావరి బ్రిడ్జి వద్దకు తీసుకొచ్చారు. మొదట గోదావరి మాతకు పసుపు, కుంకుమలు సమర్పించిన అనంతరం ఈ పుస్తకాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలుచేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు, హరితహారం, ఆసరా పెన్షన్లు, రెండో విడత గొర్రెల పంపిణీ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం, గృహలక్ష్మి తదితర పథకాల అమలుపై సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, పశుసంవర్ధక శాఖాధికారి పురంధర్, భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, మధుసూదన్‌రాజుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- కొత్తగూడెం మున్సిపాలిటీ 13వ వార్డు బర్మా క్యాంపునకు చెందిన సిరపంగి బాలకృష్ణ తమది పేద కుటుంబమని, తండ్రి, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, రోజు కూలీతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని, దళితబంధు పథకం మంజూరు చేయాలని కోరగా దరఖాస్తును ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఎండార్స్ చేశారు.
- చర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బట్ట అనిత తన భర్త జగదీష్ కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కరోనాతో మరణించారని, కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నానని, ఉద్యోగ అవకాశం కల్పించాలని దరఖాస్తు చేయగా తగు చర్యల నిమిత్తం జెడ్పీ సీఈఓకు ఎండార్స్ చేశారు.

అడ్మిషన్లు అంతంతే..

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థుల విముఖత
- జిల్లాలోని ఏడు కాలేజీల్లో 2,620 సీట్లు
- ఇప్పటివరకు చేరింది 1,252 మంది మాత్రమే



పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాల్వంచరూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదివేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా అందులో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు ఉన్నారు. మిగిలిన ఐదు కాలేజీల్లో ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలలపై అజమాయిషీ లేక బోధన అంతంతమాత్రంగానే ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు మూడు విడతలుగా ఆన్‌లైన్ (దోస్త్) ద్వారా విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం కల్పించినా అడ్మిషన్లు నామమాత్రంగానే వచ్చాయి. కళాశాల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు అంతగా ఇష్టపడడం లేదు.

రెండేళ్లుగా అరకొరగానే..

ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎక్కువ మంది డిగ్రీ కోర్సుల్లో కాకుండా ఇంజనీరింగ్ వైపు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రెండు సంవత్సరాలుగా డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు. గతంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధిస్తేనే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు లభించేవి. లేదంటే పైరవీల ద్వారా సీటు కోసం ప్రయత్నాలు జరిగేవి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు వచ్చిందంటే సర్కారు ఉద్యోగం వచ్చిందన్నంతగా విద్యార్థులు సంతోషపడేవారు. సీట్ల జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోనని ఉత్కంఠగా ఎదురుచూసేవారు. కానీ నేడు దానికి పూర్తి భిన్నంగా మారింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలంటూ ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బతిమాడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు తగినంత మంది చేరకుంటే కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు ఇలా..

కాలేజీ	సీట్లు	భర్తీ అయినవి	ఖాళీలు
పాల్వంచ	480	233	247
కొత్తగూడెం	300	125	175
భద్రాచలం	700	360	340
మణుగూరు	300	155	145
ఇల్లెందు	300	117	183
సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల	240	162	78
గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల	300	200	100

స్పెషల్ డ్రైవ్ పైనే ఆశలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఈ డ్రైవ్‌లో విద్యార్థులు చేరితే ఖాళీ సీట్లు కొంత మేరకైనా భర్తీ అయ్యే అవకాశం ఉంది. విద్యార్థులు ఇంటర్ తర్వాత డిగ్రీ కాకుండా ఇంజనీరింగ్ వైపు వెళుతున్నారు. మరి కొందరు ప్రైవేటు కళాశాలల్లో చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు.

– డాక్టర్ పి.పద్మ, ప్రిన్సిపాల్, ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇంజనీరింగ్ పైనే ఆసక్తి



డిగ్రీ కళాశాలల్లో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారంతా ఇంజనీరింగ్ విద్య వైపు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుకునేందుకు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళుతున్నారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య రెండు, మూడేళ్లుగా తగ్గింది.

– డాక్టర్ వై.చిన్నప్పయ్య, ప్రిన్సిపాల్, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

క్లుప్తంగా

పోగొట్టుకున్న సర్టిఫికెట్లు అప్పగింత



సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఐ వరప్రసాద్

మణుగూరు రూరల్ : పోగొట్టుకున్న విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లను మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్ సోమవారం బాధితులకు అందజేశారు. పినపాక మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొరస సోమయ్య పదో తరగతి మెమో, ఒకేషనల్, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లను రెండు రోజుల క్రితం మణుగూరుకు వస్తున్న క్రమంలో పోగొట్టుకున్నాడు. సర్టిఫికెట్లు దొరికిన వారు మణుగూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారి సహకారంతోనే సీఐ బాలాజీ వరప్రసాద్ బాధితుడు సోమయ్యకు సర్టిఫికెట్లను అందజేశారు.

'చలో మైదాన్'కు తరలిరండి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించనున్న చలో మైదాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామయ్య ఒక ప్రకటనలో కోరారు. అన్ని క్రీడా సంఘాల బాధ్యులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఐకేపీ సిబ్బంది వాగ్వాదం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఐకేపీ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల మధ్య వాగ్వాదం నెలకొంది. సుజ్ఞానపురం గ్రామానికి చెందిన గ్రామదీపిక భూక్యా కిషన్‌కు ఐకేపీ సీసీకి మధ్య సోమవారం కార్యాలయంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తనను అకారణంగా దూషించాడని పేర్కొంటూ సదరు సీసీపై భూక్యా కిషన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మిషన్ భగీరథ సామగ్రి చోరీ

అశ్వాపురం: అశ్వాపురం, బూర్గంపాడు మండలాల సరిహద్దులో మొండికుంట, కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో మిషన్‌భగీరథ పైపులైన్‌కు సంబంధించిన ఎయిర్ వాల్వ్‌లను శనివారం రాత్రి చోరీ చేశారు. మొండికుంట అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారి వెంబడి పైపులైన్‌కు ఉన్న తొమ్మిది ఎయిర్ వాల్వ్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆదివారం మిషన్‌భగీరథ ఆపరేటర్లు గమనించి అధికారులకు తెలియజేశారు. పైపులైన్ నిర్వహణకు సంబంధించిన కంపెనీ ప్రతినిధులు సోమవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 9 ఎయిర్ వాల్వ్‌ల విలువ సుమారు 6.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

సొత్తు అపహరణ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్ నగర్‌కు చెందిన కంచర్ల కోటేశ్వరరావు ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి చోరీ చేశారు. సోమవారం సీఐ పెద్దన్నకుమార్, ఎస్‌ఐ సంతోష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. రూ.1.60 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరించారని సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బావను హతమార్చిన వ్యక్తి అరెస్ట్

పాల్వంచరూరల్: బావను హత్యచేసి పాతిపెట్టిన బావమరిదిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ పెద్దకలశ గ్రామానికి చెందిన బాడిసె సురేష్(45)ను అతని బావమరిది మొక్కటి జోగా ఈ నెల 18న హత్య చేసి వాగులో పూడ్చిపెట్టాడు. విషయం ఆదివారం బయటపడటంతో పోలీసులు సురేష్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం విచారణ జరిపి జోగాను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యపై దాడి చేసిన భర్తపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన తేజవత్ రాజు కొద్ది రోజులుగా అతిగా మద్యం సేవించి, పేకాట ఆడేందుకు డబ్బులు ఇవ్వడం లేదని భార్య చిన్నారిపై దాడికి పాల్పడుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం... మండలంలోని కేశప్పగూడెం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. రెండు కోడి పుంజులు, రూ.5,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

కొరవడిన సమయపాలన

- కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్‌లో ఇష్టారాజ్యం!
- రోజుకు ఐదారు గంటలు కూడా పనిచేయని వైనం
- పర్యవేక్షించని సంస్థ ఉన్నతాధికారులు



కేటీపీఎస్ సెంట్రల్ ఆఫీస్

పాల్వంచ: కేటీపీఎస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విధి నిర్వహణలో సమయపాలన పాటించకుండా బయట సొంత పనులను చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. సెంట్రల్ ఆఫీస్‌లోని మూడు విభాగాల్లో అకౌంట్స్ విభాగం మాత్రమే సీ కాలనీ పక్కన ఉన్న పాత కార్యాలయంలో నడుస్తోంది. అందులోని మరో రెండు విభాగాలు ఆడిట్, అడ్మిస్ట్రేషన్ విభాగాలు 7వ దశ నిర్మాణం పూర్తయిన తర్వాత కర్మాగారం లోపలికి తరలించారు. 5,6 దశల్లో అన్ని కార్యాలయాలు కర్మాగారం లోపలే ఉన్నాయి. కానీ 7వ దశకు చెందిన సెంట్రల్ ఆఫీస్ మాత్రం రెండు చోట్ల ఉండటంతో పర్యవేక్షణ కరువైందనే ఆరోపణలు ఉన్నాయి. 7వ దశతో పాటు 5,6దశల సెంట్రల్ ఆఫీస్ పరిస్థితి ఇదే రీతిలో కొనసాగుతున్నట్లు పలువురు కార్మికులు పేర్కొంటున్నారు.

భోజన విరామానికి వెళ్లి సొంత పనులు

కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు.. 8 గంటలపాటు విధులు నిర్వర్తించాల్సిఉండగా కొందరు ఐదారు గంటలు కూడా పనిచేయడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. భోజన విరామం పేరుతో గంట, రెండు గంటలపాటు ఇళ్లకు వెళ్లి, బయట సొంత పనులు చేసుకుని వస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు ఎప్పుడు పడితే అప్పుడు బయటవెళ్లి వస్తున్నారు. కేటీపీఎస్ లోపలి కార్యాలయంలో పనిచేసే వారు మధ్యాహ్నం 12 గంటలకు ఇతర షిఫ్టుల కార్మికులు, ఉద్యోగులతో కలిసి వెళ్లిపోతున్నారు. దీంతో డ్యూటీలో ఉన్న వారు వెళుతున్నారా? లేక షిఫ్టు పూర్తైన వారు వెళ్తున్నారు అనే విషయాన్ని ఎస్‌పీఎఫ్ సెక్యూరిటీ అధికారులు పసిగట్టలేకపోతున్నారు. వెళ్లిన వారు మధ్యాహ్నం 3గంటలకు వస్తున్నారు. ఇక శనివారం అయితే మధ్యాహ్నం వరకే ఉంటున్నారని పలువురు వాపోతున్నారు. సెంట్రల్ ఆఫీస్ కర్మాగారంలో కొంత, బయట కాలనీలో కొంత ఉండటంతో బయట ఆఫీస్‌లో పని ఉందంటూ వెళ్తున్నట్లు తెలుస్తోంది. బయోమెట్రిక్‌ను సైతం పరిగణనలోకి తీసుకోవడం లేదనే వాదనలు ఉన్నాయి. గతంలో సీఈ సమ్మయ్య ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని స్టాఫ్‌లో క్రమశిక్షణ పెంచారు. సీసీ కెమెరాల్లో పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారనే పేరుంది. గేటు వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసి ఉదయం 10 గంటల తర్వాత గేటు మూసేసి, లోపలికి రానిచ్చే వారు కాదు. ప్రైవేట్ వ్యక్తులు వస్తే రిజిష్టర్‌లో పేరు, వివరాలు, వచ్చిన పని, కలిసే అధికారి పేరు, సమయం తదితర అంశాలను నమోదు చేసుకుని లోపలికి పంపించే సిస్టమ్ ఉండేది. కానీ ప్రస్తుతం ఆ విషయం కాస్త తప్పినట్లు తెలుస్తోంది.

ఏళ్లతరబడి తిష్ట

ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బంది ఏళ్ల తరబడి తిష్టవేస్తున్నారు. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని పనులు సాగిస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందికి సైతం అంతర్గత బదిలీలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ పనిప్రదేశాలు మార్చినా రికమండేషన్ చేయించుకుని తిరిగి పాత స్థానాల్లోకే వస్తున్నారు. ఆన్ డ్యూటీలో సంతకం పెట్టి కొందరు బయట వెళుతుండగా బయట ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అమలుకాని డ్రస్ కోడ్

కార్యాలయాల్లో పనిచేసే స్వీపర్ నుంచి ఫోర్ మెన్ వరకు నీలిరంగు యూనిఫాం, ఆఫీస్ అటెండర్లు తెలుపు రంగు యూనిఫాం, డ్రైవర్లు ఖాకీ రంగు దుస్తులు వేసుకోవాలి. సంస్థ వీరికి ఏడాదికి రెండు జతలు ఇస్తుంది. కుట్టుకూలితో పాటు, సబ్బులు ఇస్తున్నారు. అయినా కొందరు కార్మికులు సివిల్ డ్రస్సుల్లోనే వస్తుండటంతో అధికారులెవరు, కార్మికులు లెవరు, అటెండర్లు ఎవరూ అనేది తెలియడంలేదు. నిబంధనల మేరకు డ్రస్ కోడ్ అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కేటీపీఎస్ 7వ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

'గృహలక్ష్మి' గిరిజనులకేనా?

జిల్లాలో 87,530 దరఖాస్తులు

అశ్వాపురం: గృహలక్ష్మి పథకంలో అర్హులుగా గిరిజనులనే గుర్తించడంతో గిరిజనేతర దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గృహలక్ష్మి ద్వారా సొంత స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 87,530 మంది దరఖాస్తులు చేశారు. ఈ నెల 20లోపు సర్వే పూర్తి చేసి 25 వరకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు, సిబ్బంది 23 మండలాల్లోని గ్రామాల్లో, పట్టణాల్లో వీటిపై సర్వే చేపట్టారు. సర్వే ప్రక్రియ పూర్తి కాగాదరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపొరుస్తున్నారు. వీరిలో 23 మండలాల్లో 28412 మంది గిరిజనులు, బూర్గంపాడు మండలంలో1802, అశ్వారావుపేటలో 863, కరకగూడెంలో 607, సుజాతనగర్‌లో 367, కొత్తగూడెంలో 489 మంది గిరిజనేతరులు.. మొత్తం 32543 మందిని మాత్రమే అర్హులుగా అధికారులు గుర్తించారు. 54,706 మందిని అనర్హులుగా గుర్తించారు. ఈ నెల 27 రాత్రి వరకు బూర్గంపాడు మండలంలో 72, దమ్మపేటలో 203 దరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో ఉన్నాయి. 25,361 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా 7,182 ఇంకా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే ఐదు మండలాల్లో మినహా మిగతా ప్రాంతాల్లో కేవలం గిరిజనులను మాత్రమే అర్హులుగా గుర్తించారు. గిరిజనేతరులను అర్హులుగా గుర్తించకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. దకరఖాస్తు సమయంలో గిరిజనులు మాత్రమే అర్హులని ప్రభుత్వం ప్రకటించలేదని పేర్కొంటున్నారు. గృహలక్ష్మి పథకంలో ప్రతి నియోజకవర్గంలో 20 శాతం ఎస్సీలకు, ఎస్టీలకు 10 శాతం, బీసీలు, మైనార్టీలకు 50 శాతం తగ్గకుండా, దివ్యాంగులకు 5 శాతం అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు గిరిజనులను మాత్రమే అర్హులని గుర్తించటంపై గిరిజనేతరుల్లో అయోమయం నెలకొంది. తమను కూడా అర్హులుగా గుర్తించాలని గిరిజనేతర నిరుపేదలు కోరుతున్నారు.

శిలాఫలకంలో అచ్చుతప్పులు

హడావిడిగా ఇల్లెందు బస్ డిపో ప్రారంభం



గడువు మీరిన వాటర్ బాటిల్

ఇల్లెందు: ఇల్లెందు బస్‌డిపోను సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.1.50 కోట్లతో చేపట్టనున్న అదనపు సిమెంట్ కాంక్రీట్ ప్లాట్ ఫాం పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాటు చేసిన శిలాఫలకంలో అచ్చుతప్పులు దొర్లాయి. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి ఇంటిపేరును పల్లాకు బదులు ఎలా అని ముద్రించారు. టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేరు గోవరన్‌గా నమోదైంది. జగదాంబా సెంటర్‌లో షాపింగ్ కాంప్లెక్సు, రోడ్ విస్తరణ పనుల శిలాఫలకంలోనూ ఓ మహిళా కౌన్సిలర్ పేరు రెండుసార్లు పేర్కొన్నారు. మరో కౌన్సిలర్ పేరే లేదు. ఖమ్మం నుంచి తెప్పించిన ఈ శిలాఫలకం ఏర్పాటు చేశాక అచ్చు తప్పులు చెక్ చేశారు. అనంతరం మరో శిలాఫలకం అచ్చు వేయించి తెప్పించి ఏర్పాటు చేశారు.



అచ్చు తప్పులు దొర్లిన శిలాఫలకం

అవుట్ డేటెడ్ వాటర్ బాటిళ్ల విక్రయం

ఇల్లెందురూరల్: బస్ డిపో ప్రారంభోత్సవ సమయంలో ఓ వ్యాపారి తన వద్ద నిల్వ ఉన్న గడువు దాటిన మినీ వాటర్ బాటిళ్లను విక్రయించాడు. బాటిళ్లపై జనవరి 10, 2023న తయారు చేసినట్లుగా, జూలై 09, 2023 ఎక్స్‌పైరీ తేదీగా నమోదై ఉంది. కానీ అప్పటికే దాహంతో ఉన్న ప్రజలు బాటిళ్లు తీసుకుని తాగారు. ఆలస్యంగా గుర్తించిన కొందరు నీళ్లు తాగకుండా బాటిళ్లను అలాగే వదిలేశారు.

పీఈటీని హత్య చేయించింది ఉపాధ్యాయుడే..

- రూ.5లక్షల చొప్పున సుపారీకి ముగ్గురితో ఒప్పందం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి, పక్కన అధికారులు



నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న కారు, బైక్

కూసుమంచి: విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు ఆ బాధ్యత మరిచి... వ్యక్తిగత కక్షతో మరో ఉపాధ్యాయుడిని హత్య చేయించాడు. అంతకుముందు కూడా ఆయనపై హత్య, వేధింపుల కేసులు ఉండగా కోర్టులో పరిచయమైన వ్యక్తికి సుపారీ ఇచ్చి ఈ హత్యకు వినియోగించాడు. ఈ ఘటన 23వ తేదీన జరగగా నిందితుల వివరాలను కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి సోమవారం వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె గ్రామానికి చెందిన పగడాల గిరిధర్ రెడ్డి, బైరోజు వెంకటాచారి ఇళ్లు ఎదురెదురుగా ఉండేవి. ఇందులో గిరిధర్ తిరుమలగిరి మండలం మొండిచింత బావిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా, చారి నడిగూడెం మండలం సిరిపురం ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గిరిధర్, ఆయన భార్యకు తరచుగా గొడవలు జరుగుతుండడంతో ఆమె ఏడేళ్ల నుంచి దూరంగా ఉంటోంది. వెంకటాచారి కూడా కొన్నేళ్లుగా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఉంటున్నాడు. అయితే, చారిపై కక్ష పెంచుకున్న గిరిధర్ రెడ్డి హత్య చేయించాలని నిర్ణయించుకున్నాడు. గిరిధర్‌రెడ్డిపై గతంలో ఉన్న హత్య కేసు విచారణ నిమిత్తం సూర్యాపేట కోర్టుకు వెళ్లినప్పుడు సూర్యాపేటకు చెందిన బూసిగంపల సతీష్ పరిచయమయ్యాడు. దీంతో వెంకటాచారి హతమార్చాలని చెప్పడంతో ఒప్పుకున్న ఆయన తన స్నేహితులు మాతంగి మధు, మాతంగి చెవుల నరేష్‌ను పరిచయం చేయగా ముగ్గురికి రూ.5లక్షల చొప్పున సుపారీ ఇవ్వడంతో కోర్టు ఖర్చులు భరించేందుకు గిరిధర్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఆన్‌లైన్‌లో కారు బుక్ చేసుకుని...

ఈనెల 17న హైదరాబాద్ వెళ్లిన సతీష్ లాంగ్‌డ్రైవ్ కార్ యాప్ ద్వారా కారు బుక్ చేసుకుని వచ్చాడు. సూర్యాపేటలో రెండు కొబ్బరి బొండాలు నరికే కత్తులు కొనుగోలు చేసి మధు, నరేష్‌తో ఈనెల 19నుండి వెంకటాచారిని హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నా కుదరలేదు. చివరకు 23వ తేదీన నరేష్ బైక్‌పై వచ్చి వెంకటాచారి ఇంటి నుండి ఆయనను అనుసరిస్తూ మిగతా ఇద్దరికి ఫోన్‌లో చెప్పగా వారు కారులో వచ్చి వెంకటాచారి బైక్‌ను ఢీకొట్టగా కింద పడ్డాడు. దీంతో సతీష్, మధు చెరో కత్తితో ఆయన మెడపై పొడిచి హత్య చేసి పారిపోయారు. ఈకేసు దర్యాప్తునకు రంగంలోకి పోలీసులు ఆదివారం నేలకొండపల్లి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో వచ్చిన నలుగురు వ్యక్తులు పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వెంకటాచారి హత్య చేసింది తామేనని ఒప్పుకోవడంతో గిరిధర్‌రెడ్డి, సతీష్, మధు, నరేష్ నుంచి కారు, కత్తులు, బైక్ సీజ్ చేశామని ఏసీపీ తెలిపారు. కాగా, గిరిధర్‌రెడ్డిది మొదటి నుండి నేరప్రవృత్తేనని, ఆయనపై ఇదివరకే మూడు హత్యకేసులు, ఒక వేధింపుల కేసు నమోదయ్యాయని చెప్పారు. దీంతో 2017 నుండి మే 2022 వరకు సస్పెండ్‌లో ఉన్నాడని తెలిపారు. అయితే, వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, ఇందుకు ఆధారాలు లభించలేదని ఏసీపీ స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి, కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్సైలు రమేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామపంచాయతీ భీమ్లాతండాకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి. పురుషోత్తం కథనం ప్రకారం.. భీమ్లాతండాకు చెందిన భూక్యా కేవిల్యా(24), భూక్యాసేవా మధ్య వాటర్ పైపుల విషయంలో రెండేళ్లుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో ఈ నెల 22న రాత్రి భీమ్లాతండాలోని ఓ కిరాణ దుకాణం వద్దకు కేవిల్యా వెళ్లగా, అక్కడే సేవా కూడా ఉన్నాడు. వాటర్ పైపుల విషయంలో మళ్లీ ఘర్షణ జరగ్గా కేవిల్యాపై సేవా చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన కేవిల్యా ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించి కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి భూక్యా జామ్లీ ఫిర్యాదు మేరకు సేవాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలూరుపాడు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ స్టేషన్–2 అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నగరంలో బొక్కలగడ్డ ప్రాంతంలో సోమవారం తనిఖీలు చేస్తుండగా రాతిదర్వాజకు చెందిన పులిదాసు దుర్గారావు పట్టుబడ్డాడు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. ఆయన నుంచి రూ.16వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్సైలు సరిత, సిబ్బంది నాయక్, నరేందర్, మౌలంకార్, సురేందర్, నర్సింహారావు, వీరభద్రం, గురుప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల రిమాండ్

కారేపల్లి: గుడుంబా అమ్ముతూ పట్టుబడగా బైండోవర్ చేసినా నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిని సింగరేణి ఎక్సైజ్ అధికారులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం పాటిమీదిగుంపుకు చెందిన భూక్యా ద్వాలి, ధరావత్ వాలు గుడుంబా తయారు చేయడంతో అమ్ముతూ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తే జరిమానా విధించారు. కానీ నిర్ణీత సమయంలో జరిమానా చెల్లించపోవటం ద్వాలి, వాలును సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబికుల ఆందోళన



మృతి చెందిన శిశువు

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రిలో పాప జన్మించిన తర్వాత ఇంజక్షన్ ఇవ్వడంతో మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని హమాలీ కాలనీకి చెందిన రాకేశ్ భార్య దీపిక సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. పాప పుట్టిన కొద్ది సేపటికి వైద్య సిబ్బంది విటమిన్ ఇంజక్షన్ ఇచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్ది సేపటికే మృతి చెందిందని రోదిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి ముందు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, డెలివరీ చేసినందుకు డబ్బులు కూడా వసూలు చేశారని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావును వివరణ కోరగా.. వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని తెలిపారు. శిశువుకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లే ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసులను వివరణ కోరగా..తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా



బోల్తా పడిన బొగ్గు లారీ

మణుగూరు రూరల్ : బొగ్గు లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మణుగూరు సింగరేణి ఓసీ గని నుంచి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ రామానుజవరం గ్రామపంచాయతీ పగిడేరు క్రాస్‌రోడ్డు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కాగా లారీలు అతివేగంతో నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల వేగ నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

14 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని వేర్వేరు ఘటనల్లో సోమవారం పోలీసులు 14 కిలోల గంజాయిని పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఐదు కిలోల గంజాయి ద్విచక్రవాహనంపై ఒడిశా నుంచి విజయవాడకు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ .లక్ష ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో ఘటనలో ద్విచక్రవాహనంపై ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ 1.8 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పెంపుడు కుక్కకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన పెంపుడు కుక్కకు ఓ కుటుంబం అంత్యక్రియలు నిర్వహించింది. పట్టణానికి చెందిన పాకాల దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు 15 ఏళ్లుగా రోబో అనే కుక్కను పెంచుకుంటున్నారు. సోమవారం మరణించగా, శ్మశాన వాటికలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు పూర్తి చేశారు.

చోరీకి యత్నం

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డుకు చెందిన గుగులోత్ గోవింద్, కమల దంపతులు ఇంటికి తాళం వేసి సంవత్సరం నుంచి పాతతండాలో ఉంటున్నారు. కాగా సోమవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు పగులకొట్టి ఇంట్లో చొరబడి చొరబడ్డాడు. బీరువా తెరిచి సామగ్రిని చిందర వందరగా పడేశాడు. అయితే ఇంట్లో ఏ వస్తువూ చోరీ కాలేదు. కాగా గోవిద్ దంపతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రమణారెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించినట్లు సమాచారం.

చిత్తుబొత్తు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ: చిత్తుబొత్తు ఆడుతున్న నలుగురు వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వనమా కాలనీలో ఓ చింతచెట్టు కింద రోజూ కొందరు చిత్తుబొత్తు ఆడుతున్నారు. స్థానికులకు ఇబ్బంది కలగడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం పోలీసులు వచ్చి చిత్తుబొత్తు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



సారయ్య మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఏనుగు సారయ్య (28) విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... తాను సాగు చేసుకుంటున్న మూడెకరాల పోడు భూమికి ఇటీవలే పట్టా పొందిన సారయ్య అందులో పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. పంటకు తడి పెట్టేందుకు వెళ్లిన బోరు మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని రైతులు గమనించి సారయ్యను కొమరారం పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొమరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇల్లెందు ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

క్లుప్తంగా...

పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియలు సజావుగా కొనసాగించడం ద్వారా ఉత్తమ ప్రమాణాలు సాధించేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. బోధనకు ఎలాంటి ఆటంకం రాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థుల పూర్తి ధ్యాస పాఠ్యాంశాలపైనే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్టు ఆధారంగా పాఠశాల విద్యాశాఖ ఈ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తాజాగా విద్యాశాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది. తాజా నిబంధనల్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రధానోపాధ్యాయులు, ఆ పై అధికారులు వీటిపై విద్యా శాఖ సూచించింది. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తరువాత తమ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో ఉంచి ప్రధానోపాధ్యాయునికి అప్పగించాలి. ఉపాధ్యాయేతర సిబ్బందికీ ఇదే నిబంధన వర్తిస్తుంది.

పురందేశ్వరి టీడీపీ ఏజెంట్

- చంద్రబాబు స్క్రిప్టును బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె చదువుతున్నారు
- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలి హోదాలో పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌గా వ్యవరిస్తున్నారని తెలుగు, సంస్కృత అకాడెమీ అధ్యక్షురాలు, మాజీ సీఎం ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలైన ప్పటికీ, ఆమె చంద్రబాబు స్క్రిప్టునే చదువుతున్నారన్నారు. ఎన్నికల కోసం వదిన, మరిది ఒక్కటైపోయారని, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మూకుమ్మడిగా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ప్రజా తీర్పును చూసి చంద్రబాబు, పురందేశ్వరి మూటాముల్లె సర్దుకుని ఊరేగాల్సిందేనని ఎద్దేవా చేశారు. లక్ష్మీపార్వతి సోమవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి పదవిని లాక్కోవడంలో పురందేశ్వరి ప్రధాన కుట్రదారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తానంటే ఎన్టీఆర్ వద్దన్నారన్న కోపంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. చంద్రబాబు పార్టీలో కుట్రలు చేస్తుంటే.. పురందేశ్వరి, భువనేశ్వరి అమాయకులైన తోబుట్టువు (ఎన్టీఆర్ కొడుకులు)లకు మాయ మాటలు చెప్పి కుటుంబంలో తండ్రిపై వ్యతిరేకత తీసుకొచ్చారని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనుకుంటే పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. చంద్రబాబు, పురందేశ్వరి స్వార్థ రాజకీయాల కోసం ఎన్టీఆర్ పేరును మరింత దిగజారుస్తున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణెం పేరిట నాటకాలాడుతున్నారని తెలిపారు. గతంలో పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే చంద్రబాబుని ఆహ్వానించని పురందేశ్వరి.. ఇప్పుడెలా రూ.100 నాణెం కార్యక్రమానికి పిలుస్తారని నిలదీశారు. అప్పట్లో విగ్రహం ఏర్పాటును ఎవరికి వారు ఖాతాల్లో వేసుకునే ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు చంద్రబాబు స్క్రిప్టునే వదిన చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌పై రూ.100 నాణేన్ని కేంద్ర ప్రభుత్వమే విడుదల చేస్తే ఆయన చట్టబద్ధమైన అర్ధాంగిగా తనను ఆహ్వానించాలన్నారు.

అలాగైతే ఎన్టీఆర్ యుగపురుషుడా?

ఎన్టీఆర్ తనను వివాహం చేసుకోలేదని టీడీపీ దుర్మార్గపు ప్రచారం చేస్తోందని అన్నారు. ఎన్టీఆర్ జ్ఞాపకార్థం రూ.100 నాణెం విడుదల కార్యక్రమానికి తనను రానివ్వకుండా పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. మరి ఎన్టీఆర్ నాతో ఇల్లీగల్‌గా జీవించారా? అలా అయితే ఇల్లీగల్ పనులు చేసే వ్యక్తి యుగ పురుషుడు ఎలా అవుతారని, దీనికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ సమాధానం చెప్పాలని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతిలో బహిరంగంగా ప్రకటించిన తర్వాతే ఎన్టీఆర్ 1993లో శ్రేయోభిలాషుల మధ్య దైవసాక్షిగా తనను వివాహం చేసుకున్నారని చెప్పారు.

చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొడతా

రాష్ట్రం నుంచి చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొట్టడమే లక్ష్యంగా తాను ఎన్టీఆర్ కుటుంబంపై పోరాటం చేస్తానని లక్ష్మీపార్వతి హెచ్చరించారు. 'వచ్చే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తా. ఎన్టీఆర్‌ను ఏ విధంగా కుటుంబం మోసం చేసిందో ఆయనే ఆవేదనతో చెప్పారు. ఆ మాటలనే ఊరూరా ప్రచారం చేస్తా. నేను రాకుంటే ఎన్టీఆర్ లేచి నిలబడేవారా? మీరు బిడ్డలుగా ఆయన్ని ఏనాడైనా చూశారా? ఇప్పుడు నన్ను చులకన చేస్తూ ఎన్టీఆర్‌ను అవమానిస్తున్నారు. అందరికీ రావాల్సిన తెలివితేటలు పురందేశ్వరికి మాత్రమే వచ్చాయని ఎన్టీఆర్ చెబుతుండేవారు. తండ్రి మరణానంతరం పురందేశ్వరి కాంగ్రెస్‌లో చేరి కేంద్ర మంత్రిగా పురందేశ్వరి భారీ అవినీతికి పాల్పడ్డారు' అని లక్ష్మీపార్వతి చెప్పారు.

చిరస్మరణీయుడు

ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక అధ్యాయం
- సినిమాలతో సామాజిక న్యాయం, సమానత్వాన్ని చాటారు
- ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు



ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. పక్కన ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తన అసాధారణ వ్యక్తిత్వంతో దివంగత ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. రామాయణ, మహాభారతంలోని పాత్రలకు ప్రాణం పోసి భారతీయ సినిమా, సంస్కృతిని సుసంపన్నం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌పై రూపొందించిన రూ.100 స్మారక నాణెంను ఆమె విడుదల చేసి మాట్లాడారు.

రిక్షా దిగి నేలకు నమస్కారం..

'ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం ముద్రించాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుకు తీసుకెళ్లారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు. ఓ గొప్ప వారసత్వానికి ఆమె వారసురాలు. ఎన్టీఆర్ తెలుగు సహా పలు భారతీయ భాషల్లో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఎన్టీఆర్ గురించి నా దృష్టికి వచ్చిన ఓ ఘటనను గుర్తు చేసుకుంటున్నా. 70వ దశకంలో ఓ పెద్దావిడ తన కుమార్తెను చూసేందుకు మద్రాసు వెళ్లారు. అనంతరం మనవరాలితో కలసి రిక్షాలో వెళ్తుండగా ఓ వీధిలో జనం గుమి గూడటాన్ని చూశారు. ఆ వీధిలో ఎన్టీఆర్ ఉంటారని మనవరాలు చెప్పడంలో ఆమె వెంటనే రిక్షా దిగి భూమికి నమస్కరించారు. ఎన్టీఆర్ గురించి ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. సామాన్యుల బాధను కూడా ఆయన తన నటనతో తెలియజేశారు. మనుషులంతా ఒక్కటే సినిమా ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం సందేశాన్ని చాటి చెప్పారు. నటుడు, ప్రజా సేవకుడు, నాయకుడు ఇలా అన్నింటా ఆయన ప్రజాదరణ పొందారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు నేటికీ గుర్తుంటాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

అన్ని తరాలకు ఆదర్శ హీరో: పురందేశ్వరి

తన తండ్రి ఎన్టీఆర్ ఒక్క తరానికి మాత్రమే కాకుండా అన్ని తరాలకు ఆదర్శ హీరో అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. సినీ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక ముద్రతోపాటు మహిళలకు ఆస్తి హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

నేటి నుంచి మూడు చోట్ల విక్రయాలు

ఎన్టీఆర్ స్మారక నాణెం మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని మింట్ అధికారులు తెలిపారు. ఓ వ్యక్తి స్మారకార్థం నాణెం హైదరాబాద్‌లో రూపొందించడం ఇదే తొలిసారని హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ఆర్ నాయుడు చెప్పారు. నాణెం తయారీలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ వినియోగించామన్నారు. రూ.100 నాణెం అయినప్పటికీ దీని ధర రూ.3,500 నుంచి రూ.4,850 వరకు ఉండవచ్చన్నారు. ప్యాకింగ్ మెటీరియల్‌ను బట్టి ధర వేర్వేరుగా ఉంటుందన్నారు. స్మారక నాణెం కాబట్టి చెలామణీలో ఉండదని స్పష్టం చేశారు. తొలి విడతలో 12 వేల నాణేలను రూపొందించామని, 50 వేల నాణేల వరకు డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్, చర్లపల్లి మింట్, మింట్ మ్యూజియం వద్ద విక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు.

జీవిత విశేషాలతో వీడియో..

ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన 20 నిమిషాల వీడియోను రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శించారు. స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణి, నందమూరి కుటుంబ సభ్యులు, ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము లేకనే.. దత్తపుత్రుడు!

- నగరి సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం
- సొంత బలం, సొంత కుమారుడిపై చంద్రబాబుకు అప నమ్మకం
- ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారు

సాక్షి, తిరుపతి: సొంత బలంపై, సొంత కుమారుడిపై నమ్మకం లేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లు, మోసం, అబద్ధాలేనని ధ్వజమెత్తారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. 'ఏ ఇంటికీ, ఏ సామాజిక వర్గానికీ, ఏ ప్రాంతానికీ ఎలాంటి మంచి చేయని గత పాలకులు ఎన్ని దుర్మార్గాలకు దిగుతున్నారో నాలుగు మాటలు మీ ముందుంచుతా. దుర్మార్గమైన ఆలోచనలు చేసే ఆ పెద్ద మనిషి మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. 28 ఏళ్ల క్రితమే ఆయన ముఖ్యమంత్రి అయ్యాడు. మూడుసార్లు సీఎం అయిన ఆ వ్యక్తి పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్క మంచి స్కీమైనా మీ మెదడులో తడుతుందా? గత పాలనకు, ఈ నాలుగేళ్ల పాలనకు తేడా ఉందా? లేదా? అనేది ఆలోచన చేయండి' అని సీఎం జగన్ పేర్కొన్నారు. సభలో ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్యాకేజీ ఇచ్చి దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నాడు



ఆ మనిషి ఎలాంటివాడో అందరికంటే మీకే బాగా తెలుసు. ఆ మనిషి ఏదైనా మాట ఇస్తే నిలబెట్టుకున్నాడా? అనేది ఆలోచన చేయండి. అధికారం కోసం ఏ గడ్డి అయినా తినడానికి వెనుకాడడు. చివరికి పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడవడానికి కూడా ఏ మాత్రం వెనుకాడని మనిష.. ఆ పెద్ద మనిషి!! ఆ పెద్ద మనిషికి సొంత బలం మీద గానీ, సొంత కుమారుడి మీద గానీ నమ్మకం లేదు. కాబట్టే దత్త పుత్రుడిని ప్యాకేజీ ఇచ్చి అద్దెకు తెచ్చుకున్నాడు.

ప్రతి అడుగులో కుళ్లు, కుతంత్రాలే!

ఈమధ్య కాలంలో ఆయన గానీ, ఆయన కుమారుడు గానీ, దత్తపుత్రుడు గానీ మీటింగుల్లో మాట్లాడుతున్నప్పుడు మాట్లాడుతున్న మాటలు చూసినప్పుడు, వారి భాషను చూసినప్పుడు ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రతి మాటలోనూ రెచ్చగొట్టాలి, కుతంత్రాలు చేయాలి, గొడవలు సృష్టించి శవ రాజకీయాలు చేయాలనే కుతంత్రాలు ప్రతి అడుగులోనూ కనిపిస్తాయి.

వీళ్లతో కలిసి ఎల్లో మీడియా ప్రయాణం..

టీవీలో ఏదైనా వార్త వస్తే నిజమేనేమో అనుకునే పరిస్థితులు ఇవాళ లేవు. ఆ పాత రోజులు పోయాయి. ఈరోజు ఎల్లో మీడియా చంద్రబాబు నాయుడును ఏ రకంగా మోస్తోందో మీ అందరికీ తెలుసు. ప్రజలకు ఫలానా మంచి చేశామని చెప్పుకునేందుకు గత చరిత్ర ఏదీ లేదు కాబట్టే వీళ్లంతా అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్ల మీద ఆధారపడి వాటినే జీవితంగా మార్చుకుని రాజకీయాలు చేస్తున్నారు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అనేదే వారి లక్ష్యం.

కుర్చీ లాక్కుని ఫోటోలకు దండేస్తారు

ఇదే వ్యక్తి.. ఎన్టీ రామారావు నుంచి సీఎం కుర్చీని లాగేసుకున్నారు. ఆయనకు వెన్నుపోటు పొడిచారు. ఎన్టీఆర్ పార్టీని కూడా లాగేసుకున్నారు. ఎన్టీఆర్ చావుకు కూడా చివరకు వీళ్లే కారణం అయ్యారు. ఇదే దుర్మార్గులు మళ్లీ ఎన్టీఆర్ చనిపోగానే ఆయన శవాన్ని లాక్కుంటారు. ఫొటోలకు దండలేస్తారు. ఫొటో ముందు ప్రతి రోజూ దండం పెడుతూ తిరుగుతారు. ఆయన పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేస్తుంటే ఆ కార్యక్రమంలో కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా పాలు పంచుకుంటారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

రుణమాఫీ నగదు రైతుల చేతికే...



రైతులకు నగదు చెల్లిస్తున్న చైర్మన్ నాగచంద్రారెడ్డి

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ ద్వారా విడుదల చేస్తున్న నగదును రైతులకే నేరుగా చెల్లిస్తున్నట్లు ఖమ్మంలోని టేకులపల్లి ఆంధ్రా బ్యాంక్ కర్షకసేవా సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి వెల్లడించారు. సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన రైతులకు నగదు చెల్లించి మాట్లాడారు. సంఘం ద్వారా మొదట విడత 901 మంది రైతులకు రూ.5.08 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 315 మంది రైతులకు రూ.1.20 కోట్లు చెల్లించామని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌కుమార్, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్‌తోపాటు తమ్మినేని విజయలక్ష్మి, రాంబాబు, కిషన్, నాగార్జునరావు, కుర్రా భాస్కర్‌రావు, పొన్నం వెంకటరమణ, సీతాఓ అశోక్ పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం షాలెంరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు సోమవారం రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. జనవరి 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు 50 మస్టర్ల కన్నా తక్కువగా నమోదైన కార్మికులకు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు గైర్హాజరుకు కారణాలు ఆరా తీశారు. ఆరోగ్యం బాగాలేని వారి కోసం కమిటీ ద్వారా విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. కారుణ్య నియామకాలు పొందిన వారు ఏటా కనీసం వంద మస్టర్లు కూడా చేయకపోతే బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఈమేరకు మరో అవకాశం ఇస్తున్నందున రానున్న మూడు నెలల్లో నెలకు కనీసం 26 మస్టర్లు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధికారులు కోటిరెడ్డి, పి.సామ్యూల్ సుధాకర్, బి.రవీందర్, జత్‌రాం, డి.కిరణ్‌కుమార్, ఎం.శ్రావణ్‌కుమార్, అజయ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యాయామ విద్య.. మిథ్య

- విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించే చర్యలేవి?
- ప్రాథమిక స్థాయి నుంచే తర్ఫీదు ఇస్తే ఫలితం
- కనీసం మూడు క్రీడాంశాల్లో రాణించేలా కృషి తప్పనిసరి
- వ్యాయామ విద్యనూ సబ్జెక్టుగానే పరిగణించాలి

నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ఆర్చరీ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: విద్యలో అంతర్భాగమైన వ్యాయామ విద్యపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఏటా జరిగే పాఠశాలల స్థాయి క్రీడాపోటీల కోసం మాత్రమే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ఈ తంతు కేవలం రెండు నెలల ముచ్చటగానే నిలుస్తుండగా... మిగతా సమయంలో విద్యార్థులను క్రీడారంగంలో తీర్చిదిద్దడంపై పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో కొందరు మాత్రమే విద్యార్థులను తీర్చిదిద్దాలనే భావనతో క్రీడాభివృద్ధికి దోహదపడుతున్నారు. కాగా, పీఈటీ, పీడీగా ఉద్యోగాలు పొందిన వారు క్రీడాకారులుగా ఉంటేనే శిక్షణ ఇస్తుండగా.... క్రీడలపై పరిజ్ఞానం లేకుండా యూజీడీ, బీపీఈడీ పూర్తి చేసి ఉద్యోగాలు సాధించిన వారు పెద్దగా దృష్టి సారించకపోవడంతో విద్యార్థులకు నష్టం జరుగుతోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని క్రీడారంగంలో రాణించిన వారికే ఉద్యోగావకాశాలు కల్పిస్తే భవిష్యత్‌లో మరింత మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బాల్య దశనుంచే క్రీడలు హుళక్కేనా?

కాలనుగుణంగా క్రీడల్లో వస్తున్న మార్పుల ఆధారంగా పాలకులు కూడా క్రీడావిధానంపై మార్పులు చేయాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో కొన్ని క్రీడాంశాల్లో రాష్ట్రం, దేశం నుంచి ఎవరూ అర్హత సాధించలేకపోతున్నాయి. జిల్లాలోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో పీఈటీలను నియమించి శిక్షణ ఇప్పిస్తే కొంత మేర మార్పు వచ్చే అవకాశముంది. అంతేకాకుండా అకాడమీలు, స్పోర్ట్స్ స్కూళ్లను ఏర్పాటు చేస్తే సత్ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

నేడు ధ్యాన్‌చంద్ జయంతి

ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు దివంగత ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా దేశంలో ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో కూడా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

బాధ్యతలు నిర్వర్తించని వ్యాయామ ఉపాధ్యాయులు

క్రీడలపై పూర్తిస్థాయిలో అవగాహన లేని పీఈటీ, పీడీల్లో కొందరు విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత వదిలేసి ప్రధానోపాధ్యాయులకు బాసటగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలకు సంబంధించిన ఇతర పనులు చూస్తూ అసలు విధులు వదిలేస్తున్నారని చెబుతున్నారు. పీఈటీ, పీడీలకు స్పష్టమైన జాబ్ చార్ట్ ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైందని విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అటు పాలకులు, ఇటు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాభివృద్ధికి సహకరించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

అందుబాటులో అన్ని సౌకర్యాలు



జిల్లాలో క్రీడాసౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. క్రీడాకారులు, పీఈటీ, పీడీలు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే కల్లూరు, వైరాలో మినీ స్టేడియంలు నిర్మించగా.. ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో నిత్యం వివిధ అంశాల్లో శిక్షణ కొనసాగుతోంది.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ, ఖమ్మం

నిత్యం శిక్షణతో మంచి ఫలితాలు



చిన్ననాటి నుంచే క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం సులువవుతుంది. పీఈటీ, పీడీల కృషితోనే ఇది సాధ్యం. కొందరిని తమ వద్దకు తీసుకొస్తుండగా నిత్యం శిక్షణ ఇస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

– ఎం.డీ.గౌస్, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్

ప్రాథమిక స్థాయి నుంచే శిక్షణ ఇవ్వాలి



విద్యార్థుల్లో ఆసక్తి గుర్తించి చిన్నతనం నుంచే ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి. తద్వారా వారు భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారు. ఈ విషయంలో పిల్లల తల్లిదండ్రుల్లో కూడా పెరగాలి. అప్పుడే క్రీడల్లో అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం.

– నర్సింహారెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి

పీఈటీ, పీడీ పోస్టులు భర్తీ చేయాలి



పూర్తిస్థాయిలో పీఈటీల నియమకం చేపడితేనే అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం. క్రీడల్లో తర్ఫీదు పొందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. పాఠశాలల్లో పీఈటీలను, కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తేనే క్రీడారంగం అభివృద్ధిలో మంచి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ బి.వెంకన్న, కేయూ పీడీల సంఘం కార్యదర్శి

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

- మాజీ మంత్రి తుమ్మల వస్తే స్వాగతిస్తాం
- భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య



అశ్వారావుపేటలో మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

అశ్వారావుపేటరూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. సోమవారం ఆయన అశ్వారావుపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన పూర్తిగా భ్రష్టు పట్టిందని, దళితబంధు పేరుతో దళితులను దగా చేసిందని ఆరోపించారు. గ్రామానికి ఒకరికి కూడా ఈ పథకం అందించలేకపోయారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 14 లక్షల ఎకరాల పోడు భూములు ఉంటే, కంటి తుడుపు చర్యగా 4 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆ పట్టాలు కూడా సక్రమంగా ఇవ్వలేదని, వాటిలో సర్వే నంబర్లు, సరిహద్దులు లేవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ పోడు పట్టాలు ఇస్తామన్నారు. ధరణి పోర్టల్‌తో మోసాలు జరుగుతున్నాయని, లక్షలాది ఎకరాలు మాయమయ్యాయని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలను వాడుకుని, ఇప్పుడు వారిని కూడా మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని, ఆయన వస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కాంగ్రెస్‌లో పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, ఏదైనా మాట్లాడవచ్చని పరోక్షంగా తాటి వెంకటేశ్వర్లును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సర్వే ఆధారంగానే టికెట్లు కేటాయిస్తారని, అభ్యర్థి ఎవరైనా విజయం కోసం కలిసి పని చేస్తామని చెప్పారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ సీట్లలోనూ అత్యధిక మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి, నాయకులు తుమ్మా రాంబాబు, జ్యేష్ఠ సత్యనారాయణ, ఏనుగుల అర్జున్‌రావు, మద్దిశెట్టి సత్యప్రసాద్, తాండ్ర ప్రభాకర్, శిరీష, ఎస్కే బాబా, దుర్గారావు పాల్గొన్నారు. కాగా, పొదెం వీరయ్య పర్యటనలో స్థానిక పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే తాటి అనుచరులు దూరంగా ఉన్నారు. దీంతో పార్టీలో గ్రూపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పార్టీ సీనియర్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు అనుచరులు సైతం రాకపోగా, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వర్గీయులు మాత్రమే హాజరయ్యారు. అయితే విలేకరులతో మాట్లాడిన పొదెం వీరయ్య.. తాను ఆకస్మికంగా పర్యటనకు రావాల్సి వచ్చిందని, అందుకే అందరికీ సమాచారం అందించలేకపోయానని తెలిపారు.

అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు

- గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ఏఓ భీమ్, డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, సురేష్‌బాబు, అశోక్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, మునీర్‌బాషా, భాస్కరన్, దుర్గయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన సంక్షేమ శాఖ జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా ప్రధానోపాధ్యాయులు, ఎస్‌సీఆర్‌టీలు శ్రద్ధ వహించాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అధికారి మణెమ్మ సూచించారు. భద్రాచలంలోని పీఎంఆర్సీ భవనంలో జీపీఎస్ పాఠశాలల నిర్వహణపై ఆమె సమీక్షించారు. గిరిజన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని, మెనూ ప్రకారం భోజనం అందిస్తూ బోధనపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.